క్లుప్తంగా

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

తలుపుల: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో సోమవారం ఉదయం 7:30 గంటలకు ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ రఫీనా యక్, సర్పంచ్ శ్రీలత ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులు, అధికారులు హాజరు కావాలని సూచించారు.

రేపు వాహనాల వేలం

ఎన్పీకుంట: వివిధ కేసుల్లో పట్టుబడిన 9 వాహనాలకు ఈనెల 31వ తేదీన ఉదయం 10 గంటలకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ సద్గురుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు రూ.1,000 డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని సూచించారు.

తనకల్లులో..

తనకల్లు: వివిధ మద్యం కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈనెల 31వ తేదీన ఉదయం 11 గంటలకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఎస్‌ఐ రాంభూపాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ధర్మవరం కళాకారిణికి బెస్ట్ కొరియోగ్రాఫర్ అవార్డు



నిర్వాహకుల నుంచి అవార్డు అందుకుంటున్న రామలాలిత్య

ధర్మవరం అర్బన్: అనంతపురంలోని మాచినేని గ్రాండ్స్‌లో ఆదివారం జరిగిన అనంత షార్ట్ ఫిలిం ఫెస్టివల్‌లో ధర్మవరం కళాకారిణికి బెస్ట్ కొరియోగ్రాఫర్ అవార్డు లభించింది. అనంతపురం షార్ట్ ఫిలిం అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ధర్మవరం నాట్యాచార్యులు బాబు బాలాజీ, కమల బాలాజీ కుమార్తె రామలాలిత్యకు యూట్యూబ్‌లో చేసిన కాంతార చిత్రంలోని వరాహ రూపం అను పాటకు కొరియోగ్రఫీ చేసింది. అసోసియేషన్ నిర్వాహకులు రషీద్, రమేష్‌ల చేతుల మీదుగా అవార్డును రామలాలిత్య అందుకున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



జ్యోతి కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రామగిరి: మండలంలోని రెడ్డివారిపల్లిలో ఆదివారం అనారోగ్యంతో హరిజన జ్యోతి(22) మృతి చెందింది. గ్రామస్తులు, బంధువులు తెలిపిన మేరకు వైఎస్సార్‌సీపీ కార్యకర్త నారాయణ చిన్న కుమార్తె జ్యోతి బెంగళూరులోని ఎస్‌బీఐలో అకౌంటెంట్‌గా పని చేస్తుండేది. ఇటీవల గుండెనొప్పి రావడంతో స్థానికంగా చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందింది. వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సూచనల మేరకు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ కర్రెన్న, జెడ్పీటీసీ నాగార్జున, మండల అగ్రిబోర్డు చైర్మన్ నరసింహారెడ్డి, సర్పంచ్‌లు సిద్దన్న, రాజేష్, రామ్మూర్తి, నాయకులు వెంకటరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మారుతీరెడ్డి, అంజి, పెద్దన్న, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతు పక్షపాతి సీఎం వైఎస్ జగన్

- ఆర్బీకే ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

గాండ్లపెంట: రైతు బాగుంటే రాష్ట్రం బాగుంటుందన్న మంచి ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్ రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కటారుపల్లి గ్రామంలో రూ.22 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. తొలుత గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేను గ్రామస్తులు, పార్టీ నాయకులు పూలమాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సర్పంచ్ గంగోజమ్మ అధ్యతన ఏర్పాట చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ వ్యవసాయానికి అత్యంత ప్రాముఖ్యత ఇస్తున్నారన్నారు. రైతులకు అండగా అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. అందులో భాగంగా ప్రతి సచివాలయ పరిధిలో ఒక రైతు భరోసా కేంద్రాన్ని నిర్మించి, ఆ కేంద్రం ద్వారా రైతులకు అవసరమైన వ్యవసాయ పనిముట్లతో పాటు నాణ్యమైన విత్తనాల పంపిణీ, ఎరువులను సబ్సిడీ ధరకే అందజేస్తున్నారన్నారు. రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధరను కల్పించి రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. రైతు సాగు చేసిన పంటలకు ఎటువంటి తెగుళ్లు ఆశించినా స్థానికంగా ఉన్న వ్యవసాయ సహాయకుడిని సంప్రదించి నివారించుకోవచ్చన్నారు. అదే విధంగా ఏ సీజన్‌లో రైతు పంట నష్టపోతే అదే సీజన్‌లో పంటనష్టం అందించి రైతులకు అండగా నిలిచారన్నారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు రైతులను ఏ విధంగా మోసం చేశారో గుర్తు చేశారు. తెలుగుదేశం పాలకులు రైతును పట్టించుకోక పోగా రైన్‌గన్‌ల పేరిట ప్రజా నిధులను దుర్వినియోగం చేశారని విమర్శించారు. ముఖ్యమంత్రికి మనమందరం అండగా ఉండాలన్నారు. సకాలంలో రైతు భరోసా కేంద్రాన్ని నిర్మించి ఇచ్చిన కాంట్రాక్టర్ వద్దిరెడ్డి కృష్ణారెడ్డిని అభినందించారు. ప్రకృతి వ్యవసాయం రైతుకు ఎంతో లాభాదాయకమని, రైతులు ప్రకృతి వ్యవసాయంపై మక్కువ చూపాలని రైతు సాధికార సంస్థ రాష్ట్ర కో–ఆర్డినేటర్ ప్రభాకరరెడ్డి తెలిపారు. ప్రకృతి వ్యవసాయ వల్ల కలిగే లాభాలను రైతులకు వివరించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంపై వ్యవసాయ సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అంజినప్ప, ఏఓ లక్ష్మీప్రియ, ఎంపీపీ తాతం జగన్మోహన్, వైఎస్ ఎంపీపీ గంగోజమ్మ, కన్వీనర్ పోరెడ్డిచంద్రశేఖర రెడ్డి, మాజీ జెడ్పీటీసీ భాస్కరరెడ్డి, బీసీ కన్వీనర్ నరసింహాగౌడ్, మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు వైవీ శంకర్‌నాయుడు, మండల బూత్ కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు రవీంద్రానాయక్, సచివాలయ సిబ్బంది, సర్పంచులు, మాజీ సర్పంచ్‌లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

మరిన్ని షెడ్లు నిర్మించాలి

ధర్మవరం: పట్టణంలో నూతనంగా నిర్మించిన కాయగూరల మార్కెట్ భవన సముదాయాన్ని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆదివారం పరిశీలించారు. మార్కెట్‌లో పేదలకు మున్సిపాలిటీ ఉచితంగా నిర్మించిన షెడ్లను పరిశీలించారు. మరింత మంది పేద వ్యాపారులకు అవకాశం కల్పించేందుకు వీలుగా చేపల విక్రయశాల పక్కన మరిన్ని షెడ్లు నిర్మించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. అంతేకాక రైతులు, వ్యాపారులు, ప్రజలకు సౌలభ్యంగా ఉండేలా టాయ్‌లెట్లను అన్ని సౌకర్యాలతో నిర్మించాలని సూచించారు. మార్కెట్ ఆవరణలో చెత్తాచెదారం పేరుకు పోకుండా డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేయాలన్నారు. వచ్చే నెల మొదటి వారం లోపు మార్కెట్ ప్రారంభించేలా పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పెణుజూరు నాగరాజు, కమిషనర్ మల్లికార్జున, డీఈ వన్నూర్‌స్వామి, కౌన్సిలర్ గజ్జల శివ తదితరులు పాల్గొన్నారు.



కాయగూరల మార్కెట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ఏపీ రైతు సంఘం నూతన కమిటీ ఎంపిక

కనగానపల్లి: ఏపీ రైతు సంఘం మండల నూతన కమిటీని ఎంపిక చేసినట్లు జిల్లా గౌరవాధ్యక్షుడు బెల్లం మహదేవ తెలిపారు. మండల కేంద్రం కనగానపల్లిలో ఆదివారం మండల రైతు సంఘం నాయకులు సమావేశమయ్యారు. సమావేశానికి రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు కాటమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి జేవీ రమణ, జిల్లా నాయకులు హాజరై మండల నూతన కమిటీని ఎంపిక చేశారు. ఈ కమిటీ గౌరవాధ్యక్షుడిగా గోవిందు, అధ్యక్షుడిగా నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా ఈశ్వరయ్య, పి.రవి, ఉపాధ్యక్షుడిగా అంకే నాగేష్, సహాయ కార్యదర్శులుగా నాగరాజు, రాములను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రైతాంగ సమస్యలపై నిత్యం పోరాడుతూ రైతుల పక్షాన పనిచేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల రైతు సంఘం నాయకులు బాలరాజు, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన మండల కమిటీ సభ్యులతో ఏపీ రైతు సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు

రహదారి ఆక్రమణకు యత్నం

- రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించిన భవన యజమాని
- అడ్డుకున్న మున్సిపల్ సిబ్బంది

ధర్మవరం: పట్టణంలోని పార్థసారధి నగర్‌లోని ఓ అప్రూవ్డ్ లే అవుట్‌లో నూతనంగా ఇళ్లు నిర్మించేందుకు సిద్ధమైన భవన యజమాని రహదారిని ఆక్రమించేందుకు యత్నించారు. అనుకున్నదే తడువుగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న పెద్ద చెట్లను జేసీబీతో తొలగించారు. విషయం తెలుసుకున్న కాలనీలోని ప్రజలు మున్సిపల్ కమిషనర్, ఫారెస్ట్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున సిబ్బందిని సంఘటనా స్థలానికి పంపించి పనులను ఆపేశారు. వివరాల్లోకి వెళ్తే.. పార్థసారధి నగర్‌లో సర్వే నంబర్ 574, 578లకు ఆనుకుని 40 అడుగులు వెడల్పాటి రోడ్డు ఉంది. ఈ రోడ్డుకు ఆనుకుని సుభద్రమ్మ అనే మహిళ 4 సెంట్ల స్థలం కొనుగోలు చేసింది. అయితే స్థలం నిర్మాణంలో భాగంగా ప్రక్కనే ఉన్న 40 అడుగుల రోడ్డులో 18 అడుగులు వరకు ఏపుగా పెరిగిన చెట్లు ఉండటంతో వాటిని తొలగించి ఆక్రమించేందుకు యత్నించింది. ఏళ్ల తరబడి ఏపుగా పెరిగిన చెట్లను జేసీబీలతో తొలగిస్తుండటంతో సమీపంలోని ప్రజలు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునకు సమాచారం ఇచ్చారు. దీంతో స్పందించిన మున్సిపల్ సిబ్బందిని ఘటనా స్థలానికి చేరుకుని పనులను అడ్డుకున్నారు. రోడ్డును ఒక్క అడుగు కూడా ఆక్రమించేందుకు వీలు లేదని కమిషనర్ భవన యజమానిని ఆదేశించారు. ఈ విషయమై సాక్షి మున్సిపల్ కమిషనర్‌ను సంప్రదించగా.. రోడ్డు ఆక్రమణకు గురైనట్లు తనకు ఫిర్యాదు అందడంతో సిబ్బందిని పంపి పనులు నిలిపి వేయించడం జరిగిందన్నారు. భవన యజమానులకు ఏమైనా సందేహాలు ఉంటే తిరిగి రీసర్వే చేయించుకోవాలని సూచించడం జరిగిందన్నారు.



రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను జేసీబీతో తొలగించిన దృశ్యం

చెట్లను నరకడం దుర్మార్గం

పార్థసారధి నగర్‌లో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పెద్ద పెద్ద చెట్లను జేసీబీలతో తొలగించి రోడ్డును ఆక్రమించుకోవాలని చూడటం దుర్మార్గం. ఈ విషయమై తాము మున్సిపల్, ఫారెస్ట్ అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగింది. అధికారులు స్పందించి రహదారి అన్యాక్రాంతం కాకుండా చూడాలి. పచ్చని చెట్లను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉంది. చెట్లను దురుద్దేశంతో తొలగించిన భవన యజమానిపై చర్యలు తీసుకుని జరిమానా విధించాలి.

– డాక్టర్ భాస్కర్ నాయుడు, పర్యావరణ వేత్త

పంట రుణాలు రెన్యూవల్ చేసుకోండి

ధర్మవరం రూరల్: మండలంలోని గొట్లూరు పీఏసీఎస్‌లో పంట రుణాలు తీసుకున్న రైతులు ఫిబ్రవరి 27వ తేదీలోపు 7 శాతం వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేసుకోవాలని సీఈఓ నారాయణ స్వామి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అదే విధంగా ప్రస్తుతం జిల్లాలు మారినందున రైతుల డేటాను కొత్త సీబీఎస్‌లో నమోదు చేయాల్సి ఉందన్నారు. ఇందుకు రైతులు తమ ఆధార్ కార్డు, వన్‌బీ, పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్, ఫోన్ నంబర్, ఫొటోలను బ్యాంక్‌లో అందజేయాలన్నారు. వివరాలకు 9704052002 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

తనకల్లు: భర్త వేధింపులను తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మమత అనే వివాహిత చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని చీకటిమానిపల్లికి చెందిన మమతను భర్త రమేష్ మద్యం సేవించి రోజూ వేధించేవాడు. వేధింపులతో విసిగిపోయిన మమత ఈనెల 24వ తేదీన ఇంట్లో ఎలుకల మందు పేస్టును తిని ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స కోసం హుటాహుటినా కదిరి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అయితే పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురానికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. తండ్రి రామాంజినేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఎన్ఎంఎంఎస్ నమూనా పరీక్ష

ధర్మవరం అర్బన్: కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ నమూనా పరీక్షను స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ సహకారంతో స్థానిక బీఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. 8వ తరగతి చదువుతున్న విద్యార్థినులకు ఎన్ఎంఎంఎస్ నమూనా పరీక్షను నిర్వహించారు. ధర్మవరం స్కూల్ అసిస్టెంట్ ప్రతినిధులు, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు నమూనా పరీక్ష ప్రశ్నాపత్రాలను విడుదల చేశారు. 120 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఉమాపతి, స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అన్నం సుధాకర్, ఉపాధ్యక్షుడు సత్యమయ్య, రాష్ట్ర కౌన్సిలర్ ఉమామహేశ్వర ప్రసాద్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి నారాయణస్వామి, ఉపాధ్యాయులు రామకృష్ణనాయక్, మాధవ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

అంధుల మార్గదర్శకుడు బ్రెయిలీ

పుట్టపర్తి టౌన్: అంధులకు మార్గదర్శకుడిగా లూయీ బ్రెయిలీ నిలిచారని అంధుల సంఘం రాష్ట్ర కార్యదర్శి జలంధర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సాయిఆరామంలో జిల్లాలోని అంధులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లూయీ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. అనంతరం జలంధర్ రెడ్డి మాట్లాడుతూ.. బ్రెయిలీ చిన్నతనంలో కళ్లు పోగొట్టుకున్నా అధైర్యపడకుండా అంధుల కోసం లిపిని కనుగొన్నారని కొనియాడారు. ఈరోజు చాలామంది అంధులు ఉద్యోగాలు చేస్తున్నారంటే అది ఆయన చలువే అన్నారు. అంధులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వ సదుపాయాలను వినియోగించుకుని ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు షఫీ, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నాగరాజు, సత్యసాయి జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, నాయకులు హరినాథరెడ్డి, కిష్టప్ప, గంగన్న, అన్వర్ బాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జలంధర్‌రెడ్డి

నేడు సచివాలయాల్లో స్పందన

తాడిమర్రి: మండలంలోని గ్రామ సచివాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం తాడిమర్రి, పెద్దకోట్ల, దాడితోట, కునుకుంట్ల, చిల్లవారిపల్లి, పిన్నదరి, ఎం.అగ్రహారం, నార్శింపల్లి, చిన్నచిగుళ్లరేవు సచివాలయాల్లో స్పందన నిర్వహిస్తామన్నారు. అలాగే స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కూడా స్పందన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

బత్తలపల్లి: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ యుగేశ్వరిదేవి తెలిపారు. మండలంలోని 11 గ్రామ సచివాలయాల్లో సచివాలయ ఉద్యోగులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు. అదే విధంగా మండల స్థాయిలో జరిగే స్పందన కార్యక్రమానికి అధికారులందరూ హాజరు కావాలని సూచించారు.

కొత్తచెరువు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రామాంజినేయులు రెడ్డి తెలిపారు.

కనగానపల్లి: స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తహసీల్దార్ పీవీ రమణ, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ ఆదివారం తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి మారు పూజ



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

కనగానపల్లి: మండలంలోని దాదులూరు కొట్టాలలో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ఆదివారం మారుపూజ నిర్వహించారు. గ్రామంలో గతేడాది సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. స్థానిక గ్రామ పెద్దల ఆధ్వర్యంలో తిరిగి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు చేశారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలకంరించి, భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్థానిక గ్రామస్తుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

కాటికోటేశ్వర క్షేత్రంలో పూజలు

తాడిమర్రి: మాఘమాసం సందర్భంగా మండలంలోని చిల్లవారిపల్లి శ్రీకాటికోటేశ్వర క్షేత్రంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి కాటికోటేశ్వరస్వామి మూలవిరాట్‌కు వెండి ఆభరణాలు తొడిగి, పూలమాలలతో అలంకరించారు. భక్తులు ముందుగా గదాగుండంలో పుణ్యస్నానాలు ఆచరించి, ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేశారు. అనంతరం స్వామికి కొబ్బరి కాయలు కొట్టి పూజలు చేశారు. సాధారణంగా కాటికోటేశ్వర క్షేత్రంలో ఆదివారం భక్తులు స్వామికి పూజలు నిర్వహించి, ఆ రాత్రి ఆలయ ప్రాంగణంలో నిద్రచేసి, సోమవారం ఉదయమే భక్తులు అక్కడి నుంచి వెళతారు.

ఆలయాల వద్ద పాల పొంగులు

బత్తలపల్లి: మాఘ మాసం దీక్షలు చేపట్టిన పలువురు మహిళలు రెండో ఆదివారం పాల పొంగులు నిర్వహించారు. తెల్లవారు జామునే దేవాలయాలకు వెళ్లి ప్రదక్షణలు చేసి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కొత్త కుండలో నైవేద్యం చేసి పూజలు చేశారు. మండలంలోని సంజీవపురం కాటికోటేశ్వ క్షేత్రం, సంఘమేశ్వర క్షేత్రంలోనూ, మాల్యవంతం, రామాపురం, కోడేకండ్లలోని వీరనారాయణస్వామి, డి.చెర్లోపల్లి సిద్దేశ్వరాలయం, దంపెట్ల చెన్నకేశవాలయం, ముష్టూరు, పోట్లమర్రి శివాలయంలోనూ, గంటాపురం అప్పస్వామి దేవాలయాల్లోనూ పాల పొంగులు నిర్వహించారు.



పూజలందుకుంటున్న లక్ష్మీ వేంకటేశ్వరుడు

రేపు భద్రావతి భావనారుషీంద్రుల కల్యాణం



అలంకరణలో భద్రావతి భావనా రుషీంద్రులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని మార్కెట్ వీధిలో ఉన్న మార్కెండేయ స్వామి ఆలయంలో ఈనెల 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకూ భద్రావతి భావనా రుషీంద్రుల 57వ కల్యాణ మహోత్సవాలు నిర్వహించనుననట్లు పద్మశాలీయ బహుత్తమ సంఘం అధ్యక్షుడు జక్కా చిన్న శింగరయ్య తెలిపారు. 30వ తేదీన బిందె సేవ (గంగపూజ), 31న భద్రావతి భావనా రుషీంద్రుల కల్యాణం, అన్నదానం, సాయంత్రం ఉత్సవమూర్తుల గ్రామోత్సవం, ఫిబ్రవరి 1వ తేదీన వసంత మహోత్సవం, సాయంత్రం డోలోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది

కదిరి అర్బన్: మండల పరిధిలోని కాళసముద్రం గురుకుల పాఠశాలలో ఆదివారం మలేరియా సబ్ యూనిట్ సిబ్బంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పాఠశాలలో దగ్గు, జలుబుతో బాధపడుతున్న విద్యార్థుల రక్త నమూనాలు సేకరించారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. పాఠశాల ఆవరణంలో అంబెట్ పౌడర్ పిచికారీ చేశారు. సోమవారం పట్నం వైద్య సిబ్బంది మెడికల్ క్యాంప్ నిర్వహిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ దేవలాల్ నాయక్, మలేరియా సూపర్‌వైజర్ శశిధర్, ఏఎన్ఎం రాజేశ్వరి పాల్గొన్నారు.

హక్కుల కోసం పోరాటం చేయాల్సిందే



మాట్లాడుతున్న ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి దుర్గాభవాని

పుట్టపర్తి టౌన్: మహిళా సాధికారత, హక్కుల సాధనకు పోరాటాలు చేయాల్సిందేనని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవాని పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణ సమీపంలోని గణేష్ కూడలి వద్ద ఉన్న షాదీమహల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళల హక్కులు, సాధికారిత కోసం మహిళా సమాఖ్య అనేక పోరాటాలు చేసిందన్నారు. సమావేశంలో సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పద్మావతి, జిల్లా సీపీఐ, ఏఐ కార్యదర్శులు వేమయ్యయాదవ్, బయన్న, నాయకులు వెంకట నారాయణ, జయలక్ష్మి, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

రేపు కౌన్సిల్ మీట్

కదిరి: మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ఈనెల 31వ తేదీన ఉదయం 11 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు చైర్‌పర్సన్ పరికి నజీమున్నీసా, కమిషనర్ శ్రీహరిబాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వార్డు సమస్యల ప్రస్తావన, పలు అభివృద్ధి పనులపై చర్చ ఉంటుందన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

ధర్మవరం: పట్టణంలోని 4వ వార్డు శాంతినగర్‌లో ఉన్న మున్సిపల్ స్కూల్‌లో ఆదివారం వార్డు కౌన్సిలర్ జేసీబీ రమణ సహకారంతో కిమ్స్ సవేరా ఆసుపత్రి వైద్యులు నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఈ సందర్భంగా వైద్యులు ఈసీజీ, బీపీ, 2డీ ఎకో, జీఆర్‌బీఎస్ పరీక్షలు చేశారు.